
ప్రజాశక్తి

శనివారం 26 అక్టోబర్ 2024



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శనివారం పలు గిరిజన గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు విద్యుత్ శాఖ ఇఇ కె.గోపాలరావునాయుడు తెలిపారు. సాలూరు మండలం తుండ ఫీడర్ పైనా 11 కెవి ఆర్‌డిఎస్ఎస్ పనులు జరుగుతున్న కారణంగా ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3గంటలకు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు, కావున నంద, బొద్దవలస, ఇటికవలస, జోడిమామిడి, తుండ, వడ్డివలస, తాడివలస, ఉల్లిచింతలవలస, రాయిమానివలస, చిన్న ఊటగెడ్డ, అప్పందొర వలస, మడవలస, మోడంగి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు

ఇసుక ఎంతైనా తెచ్చుకోవచ్చు

- మార్చి 31లోగా నిర్మించని ఇళ్లు రద్దు
- జెడ్‌పి సమావేశంలో మంత్రులు శ్రీనివాస్,సంధ్యారాణి
- ఉపాధి హామీ పనులన్నీ పంచాయతీల తీర్మానంతోనే చేపట్టాలి : జెడ్‌పి ఛైర్మన్
- జిల్లాలో ఇసుక కొరత లేదు : కలెక్టర్ అంబేద్కర్
- గుర్ల డయేరియా మృతులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తీర్మానం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సొంత అవసరాల కోసం ఇసుక ఎక్కడ నుంచైనా, ఎంతైనా ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా తీసుకు వెళ్లే అవకాశాన్ని కల్పించినట్లు రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యా రాణి అన్నారు. ఎలాంటి కేసులు ఉండబోవని చెప్పారు. లారీల ద్వారా రవాణాచేసుకుంటే వ్యాపారం కోసం తీసుకెళు ‌‌నట్టుగానే ప్రభుత్వం గుర్తిస్తుందని అన్నారు. అనుమతి లేకుండా లారీలపై ఇసుక రవాణా చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జెడ్‌పి సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ఫ్ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. పలు అంశాలపై వాడివేడిగా చర్చజరిగింది. హౌసింగ్‌పై చర్చ లో భాగంగా సభ్యులు మాట్లాడుతూ ఇసుక దొరకడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. మంత్రులు స్పందిస్తూ ఇసుక పై ఎలాంటి సీనరేజి, రుసుం లేదని, ఎక్కడ ఇసుక అందుబాటులో ఉంటే అక్కడి నుంచి తెచ్చుకోవచ్చని తెలిపారు. ఇసుక ఉచితమేనని, రవాణా ఖర్చులు లబ్దిదారులే భరించాలని మంత్రి స్పష్టం చేసారు. ప్రైవేటు భూముల్లో కూడా ఇసుకను తవ్వుకోవచ్చని, ఇందుకోసం ముందస్తుగా భూగర్భ గనులశాఖ నుంచి అనుమతిని పొందాల్సివుంటుందని పేర్కొన్నారు. నదులు, ఇసుక రీచ్‌లు లేని ప్రాంతాల వారు ఇసుకను పొందడం కష్టంగా ఉందని, వారికి ప్రత్యామ్నాయాన్ని చూపాలని ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ కోరారు. ఇసుక అంశం పై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో గత 4 నెలల్లో 92 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉండేదని, రోజుకు సుమారుగా వెయ్యి టన్నులను ఉచితంగా సరఫరా చేశారని, మెట్రిక్ టన్నుకు రూ.605 నిర్వహణా ఛార్జీలను మాత్రమే తీసుకున్నామని వివరించారు. ప్రస్తుతం 60 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని ప్రస్తుతం జిల్లా అవసరాలకు ఇసుక సరిపోయేటంత ఉందని తెలిపారు. వంతెనలు, రైల్వే ట్రాక్ ల వద్ద తవ్వితే నేరం అని, మిగిలిన ఎక్కడైనా గృహ అవసరాలకు ఇసుక ను తీసుకోవచ్చని వివరించారు.

గ్రామసభల తీర్మానంతోనే ఉపాధి పనులు

గ్రామసభల తీర్మానంతోనే గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని మెజార్టీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆగష్టు 23న నిర్వహించిన గ్రామ సభల్లో ఆమోదం పొందని పనులు కూడా తలపెడుతున్నారని, ఇది చట్ట విర్ధుమని జెడ్‌పి ఛైర్మన్ సహా సభ్యులు నిలదీశారు. ఛైర్మన్ మాట్లాడుతూ వెండర్ ద్వారా బిల్లులు చెల్లిస్తున్నారని, అలా కాకుండా గ్రామ పంచాయతీల ద్వారా చెల్లింపులు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే గ్రామ, మండల, జిల్లా పరిషత్‌లలో ఆమోదం పొందిన తర్వాతనే పనులు చేపట్టాలని తెలిపారు. కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ స్పందిస్తూ ఉపాధి నిధులతో గ్రామ సభల్లో ఆమోదం పొందిన పనులను మాత్రమే చేస్తామని, పంచాయతీ తీర్మానం లేకుండా చేస్తున్న పనులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

డయేరియా మృతులకు పరిహారమివ్వాలని తీర్మానం

గుర్లతోపాటు ఆ ప్రాంతంలో డయేరియాతో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని జెడ్‌పి సర్వ సభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సభలో తొలుత ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ గుర్ల లో డయేరియా తో 10 మంది మరణించడం విచారకరమని, డిప్యూటీ సిఎం స్పందిస్తూ ఒక్కొక్కరికీ లక్ష రూపాయల చొప్పున, జగన్ మోహన్ రెడ్డి రెండేసి లక్షల చొప్పున పరిహారం అందించారని, ప్రభుత్వం నుండి కూడా పరిహారం అందిస్తే బాధితులకు కొంత ఊరట లభిస్తుందని, ఈ విషయాన్నీ జిల్లా పరిషత్ ద్వారా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని తెలిపారు. ఛైర్మన్ అంగీకారం తో తీర్మానం చేశారు. తాటిపూడి జలాశయానికి గురుపాటి బుచ్చి అప్పా రావు పేరును పెట్టాలని కోరుతూ సభ తీర్మానం చేసింది.

విఐఎల తొలగింపుపై రగడ

గ్రామైక్య సంఘాల విఒఎలను కనీసం ఎలాంటి నోటీసు జారీ చేయకుండా 75 మందిని మార్చేశారంటూ వైసిపికి చెందిన సభ్యులు అధికారులను నిలదీశారు. స్పందించిన మంత్రి శ్రీనివాస్ డిఆర్‌డిఎకు ఆయా విఒఎల నియామ కాలతో సంబంధం లేదని, మెజార్టీ సభ్యుల ఓటింగ్ తోనే విఒల ఎన్నిక జరుగుతుందని బదులిచ్చారు. పనితీరు బాగోలేకపోయినా, అక్రమాలకు పాల్పడినా మెజార్టీ ఓటింగ్‌తో విఒను తొలగించవచ్చని అన్నారు. అసలు సభ్యులకే తెలియకుండా విఒలను ఎలా తొలగిస్తారని జెడ్‌పి ఛైర్మన్‌తోపాటు పలువురు సభ్యులు మంత్రిని నిలదీశారు. ఈ సందర్భంగా ఇటు మంత్రులు, అటు ఛైర్మన్ సహా సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది.

ప్రారంభం కాని 12వేల ఇళ్లు రద్దు

హౌసింగ్ శాఖ చర్చలో భాగంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 12వేల గృహాలు ప్రారంభం కానివి ఉన్నాయని, వచ్చే మార్చి 31 లోగా ప్రారంభం కానివాటిని రద్దు చేస్తామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో లబ్దిదారులకు అవగాహన కల్పించాలని అన్నారు. కొత్తవలసలో మంజూరైన స్థలాలను ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం కోసం మంజూరైన వాటిని రద్దు చేసారని, వేరే చోట ఇచ్చినప్పటికీ నీటి సమస్య వలన నిర్మాణాలు చేపట్టలేకపోయారని స్థానిక జెడ్‌పిటిసి సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా, బోర్ వెల్స్‌ను వేయించాలని మంత్రులు హౌసింగ్ పీడీకి సూచించారు. గృహ నిర్మాణాలకు అందిస్తున్న రూ.1.8 లక్షలను రూ.2.5లక్షలకు పెంచాలని పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు కోరారు. సమావేశంలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి గజపతి రాజు, తోయక జగదీశ్వరి, బోనెల విజయ్ చంద్ర, పార్వతీపురం జెసి శోభిక, జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, రెండు జిల్లాలకు చెందిన జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు



అంతర్ రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు, రైతు సంఘం నాయకులు

తగ్గించిన పాల సేకరణ ధరను పెంచాలి

అంతర్రాష్ట్ర రహదారిపై పాడి రైతుల రాస్తారోకో

29న విశాఖ డెయిరీ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి - సీతానగరం

విశాఖ పాల డెయిరీ పాల సేకరణ ధరను తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ పాడిరైతులు శుక్రవారం విజయనగరం- పార్వతీపురం అంతర్ రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ విశాఖ డెయిరీకి పాలు సేకరిస్తున్న రైతులకు అర్థాంతరంగా ఆవుపాల ధరను తగ్గించి రైతులపై పెనుభారాన్ని మోపడాన్ని రైతులంతా వ్యతిరేకించాలని, ఇప్పటికే పాల సేకరణ రైతులకు ఇవ్వాల్సిన బోనస్ ఇవ్వకుండా విశాఖ డెయిరీ ఎగ్గొట్టారని అన్నారు. ఒక వైపు పశుదాణాకు విపరీతంగా ధర పెంచి రైతులపై భారాలు మోపుతున్నారని అన్నారు. అంతే కాకుండా పాల రైతుల డబ్బుతో డైరీకున్న ఆస్తులు పాలకవర్గం ఇష్టానుసారంగా ఖర్చు చేస్తూ అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిందని, పాల రైతులకు ఇవ్వాల్సిన బోనస్, పాల సేకరణ ధర విషయంలో అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న చక్కెర కర్మాగారం లాంటి దుస్థితిని, విశాఖ డెయిరీకి పట్టించి తద్వారా ప్రైవేట్ డైరీ యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. డెయిరీ యాజమాన్యం తగ్గించిన పాల సేకరణ ధర పెంచకపోతే ఈనెల 29న విశాఖ డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. తొలుత కాశయ్యపేటలోని పాల సేకరణ (బల్క్ సెంటర్) కేంద్రం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో పాడిరైతుల సదస్సు జరిగింది. కార్యక్రమంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు రెడ్డి రమణమూర్తి, రైతు సంఘం నాయకులు గేదెల సత్యనారాయణ, బంటు దాసు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, సిడిసి మాజీ ఛైర్మన్ నడిమింటి రామకృష్ణ, తేలు ప్రభాకర్, నాగిరెడ్డి రామారావు, బి.ధనుంజయ, పైల విశ్వనాథం, సిరికి శ్రీను, తదితర పాడి రైతులు పాల్గొన్నారు.

చెరకు తోట దగ్ధం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని కుందరతిరువాడ మాజీ సర్పంచ్ ముదిలి పెద్దినాయుడుకు చెందిన సుమారు రెండు ఎకరాల చెరకు తోటకు నిప్పంటుకొని దగ్ధమైంది. గురువారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. విషయంతెలుసుకున్న స్థానిక కుందరతిరువాడ, చినకుదమ రైతులంతా కలిసి మంటలను అదుపు చేశారు. ఆ సమయంలో గాలి లేకపోవడం వల్ల సుమారు మరో 40 ఎకరాల చెరుకు రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం తప్పింది న్నారు. నిప్పంటుకున్న చెరకు పంటను రెవెన్యూ, ఆర్టికల్చర అధికారులు పరిశీలించి తమకు నష్టపరిహారం అందించాలని వారు కోరుతున్నారు.



పశువైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పశుసంపద వృద్ధి చెందాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని పశుసంపద మరింత వృద్ధి చెంది, తద్వారా రైతుల ఆదాయం పెరిగి ఆర్థిక వృద్ధి చెందేలా కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పశు వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక పశు వైద్యశాల సమీపాన ప్రైవేట్ డెయిరీ ఫారం వద్ద 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని కలెక్టర్ పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పశువుల గణాంకాల కార్యక్రమాన్ని చాలా జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగనున్నందున అప్పటి వరకు జిల్లాలోని ప్రతి ఇంటిని సందర్శించి, పశువుల సమగ్ర సమాచారాన్ని సేకరించాలన్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా రోజుకు 10వేల లీటర్ల పాలు, 10వేల కిలోల మాంసం విక్రయాలు జరుగుతున్నాయని, ఇది మరింత పెరిగేలా కృషి చేయాలని అధికారులను కోరారు. జిల్లాలోని ప్రతి ఇంటిని సందర్శించి రైతుతో మాట్లాడి పశు గణాంకాల వివరాలతో, వాటి ద్వారా లభించే ఆదాయ వివరాలను కూడా సేకరించాలన్నారు. ఇంటిని సందర్శించినట్లు ప్రభుత్వం జారీచేసిన స్టిక్కర్లను ఖచ్చితంగా అతికించాలని చెప్పారు. క్షేత్రస్థాయి పర్యటనలో వాటిని పరిశీలిస్తామని, ఎక్కడైనా కనిపించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికంగా పశు సంపదను ప్రోత్సహిస్తూ, వాటి ద్వారా ఆదాయం పొందుతున్న డెయిరీ ఫారం యజమాని నర్సింనాయుడును కలెక్టర్ అభినందించారు. ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు ఉత్తమ రైతు అవార్డును ప్రకటించాలని, ఈసారి అవార్డు కోసం సిఫార్సు చేయాలని పశు సంవర్ధక అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పశు వైద్యాధికారులకు మైక్రో స్కోపులను, గణాంక అధికారులకు లైవ్ స్టాక్ సెన్సస్ బ్యాగులను కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం 21వ అఖిల భారత పశుగణన పోస్టర్లను ఆవిష్కరించారు. తొలుత గోపూజా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్య శాఖాధికారి డాక్టర్ ఎస్.మన్మధరావు, సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.ప్రసాద్, డాక్టర్ సిహెచ్.దీనకుమార్, ఇతర వైద్యాధికారులు, పశుగణన అధికారులు, గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

30న ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు ఈనెల30న క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్ బాల్, ఖో- ఖో , బెస్ట్ ఫిజిక్, హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీ బాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్ క్రీడల్లో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తామన్నారు. చడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ మేరకు 30న స్థానిక ఆర్‌సిఎం స్కూల్ కాంప్లెక్స్ వద్ద ఎంపిక చేస్తామన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ఉద్యోగులను నవంబరు 6నుంచి 9 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారిని జాతీయ స్థాయి క్రీడా పోటీలకు రాష్ట్రం తరపున పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల సివిల్ సర్వీస్ ఉద్యోగులు తమ డిపార్ట్‌మెంట్ గుర్తింపు ఐడి కార్డుతో ఎంపికకు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 9866805716, 9701648344 మొబైల్ నెంబర్లను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులో వైన్‌షాప్

నిబంధనలకు విరుద్ధంగా అనుమతి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని పెదమార్కెట్ సమీపంలో ఉన్న మున్సిపల్ షాపులో వైన్ షాప్ నిర్వహణకు అనుమతి ఇవ్వడం చర్చనీయాంశమైంది. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ భవనాల్లో వైన్ షాప్‌లు నిర్వహించరాదు. ఈ విషయాన్ని ఎక్సైజ్ అధికారులు కూడా స్పష్టం చేశారు. అయితే కాసులకు కక్కుర్తిపడిన మున్సిపల్ అధికారులు మున్సిపల్ షాపులో వైన్ షాప్ నిర్వహణకు అనుమతి ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైన్ షాపు నిర్వహణపై మొదట వ్యతిరేకించిన మున్సిపల్ కమిషనర్ సిహెచ్. సత్యనారాయణ రెండు రోజుల తరువాత అనుమతి ఇవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. దీనిపై కమిషనర్‌ను శుక్రవారం వివరణ కోరగా పాతికేళ్లుగా మున్సిపల్ షాపులో వైన్ షాప్ నిర్వహించినట్లు తెలిసిందని, అందుకే అనుమతి ఇచ్చినట్లు చెప్పారు.

మృతుడి కుటుంబానికి

రూ.10లక్షల పరిహారం అందజేత

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని పెద్ద బొండపల్లిలో గురువారం జరిగిన ఏనుగుల దాడిలో మరణించిన దేవా బత్తుల యాకోబ్ కుటుంబానికి శుక్రవారం స్థానిక బోనాల విజయ్ చంద్ర, జిల్లా అటవీ శాఖ అధికారి జిఎపి ప్రసూన బాధిత కుటుంబానికి రూ.10 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధుడు మృతి చెందడం చాలా బాధాకరమని, ఆయన లేని లోటు తీర్చలేమన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని, అటవీశాఖ అధికారులు తక్షణం స్పందించి ఈ ఎక్స్‌గ్రేషియో మంజూరు చేశారన్నారు. అలాగే గ్రామస్తులు అంతా సహకరించాలని ఎవరు ఏనుగులను ఫోటోలు, వీడియోలు తీయడం వంటి చేయవద్దని ఎమ్మెల్యే కోరారు. వన్యప్రాణుల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు.

తొలుత డిఎఫ్ఒ ప్రసూన బాధిత ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాపార్వతీపురం మండలంలో సంచరిస్తున్న ఏడు ఏనుగుల్లో రెండు చిన్న గున్న ఏనుగులు ఉండడం వల్ల, ఏనుగుల గుంపు వాటిని రక్షించుకోవాలని తాపత్రయంతో, ఉద్రిక్తంగా ప్రవర్తిస్తుంటాయని, కనుక అటవీ శాఖ అధికారులతో సహకరించి ట్రాకర్ల సూచనల మేరకు కనీసం 200 మీటర్ల దూరంగా ఏనుగులకు ఉండాలని కోరారు. అలాగే ఏనుగులను జిల్లా నుంచి తరలించేందుకు జిల్లా నుంచి ప్రభావంతులైన ఇద్దరు ట్రాకర్లను ఎంపిక చేసి వారిని కర్ణాటక పంపించి కుంకీ ఏనుగులతో కలిసి వ్యవహరించేందుకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. శిక్షణ ముగిసిన వెంటనే కుంకి ఏనుగులను జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులపై ప్రయోగించి వాటి గమనాన్ని నియంత్రిస్తామని తెలిపారు. ట్లాడారు. అనంతరం అటవీశాఖాధికారులతో తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ, రేంజ్ అధికారి రామ్ నరేష్ బిర్లంగి, ఫారెస్టర్ మనోజ్ కుమార్, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు బోను చంద్రమౌళి, జి.చంద్రమౌళి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



బాధితులకు పరిహారం అందజేస్తున్న ఎమ్మెల్యే, డిఎఫ్ఒ

పాటల రచయిత శివాజీకి సన్మానం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురంకు చెందిన ప్రముఖ సినీ పాటల రచయత తుంబలి శివాజీని శుక్రవారం స్థానిక ఎస్‌విసి టిబిఆర్ సినిమా హాల్ మేనేజర్ మగ్రాపు ప్రకాష్ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. టిబిఆర్ సినిమా హాల్లో విడుదలైన ఎంత పని చేశావు చంటి' సినిమాకు ఐదు పాటలు రాసిన శివాజీకి థియేటర్ సిబ్బందితో కలిసి ఆయన దుస్సాలుగా కప్పి, పుష్పగుచ్చం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ రాసిన పాటలు యువతతో పాటు ఫ్యామిలీని ఆకట్టుకునేలా ఉన్నాయన్నారు. జిల్లాకు చెందిన ప్రతిభావంతుడైన శివాజీని సన్మానించడం సంతోషకరంగా ఉందన్నారు. బాల రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు తదితరులు మాట్లాడుతూ ఇప్పటివరకు 24 సినిమాలకు పైబడి చక్కని పాటలు రాసిన శివాజి మన ప్రాంతం వాడు కావడం ఆనందదాయకమన్నారు. ఇటీవల విడుదలైన మన్యం ధీరుడు సినిమాలో భరతమాతను వర్ణిస్తూ రాసిన పాట అద్భుతమన్నారు. అలాగే ఎంత పని చేశావు చంటి సినిమాలో రాసిన ఐదు పాటలు ప్రస్తుత సమాజంలో కుటుంబాల మధ్య చోటు చేసుకున్న ప్రేమ, ఆప్యాయత, అనురాగం, మమతలు తదితరవి తెలియజెప్పేవిగా ఉన్నాయన్నారు. పాటలు బాణీలు మళ్లీ పాడుకునేలా ఉన్నాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని సినిమాలకు పాటలు రాసి జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టిబిఆర్ సినిమా హాల్ సిబ్బంది కె.శ్రీనివాసరావు, బి.వేణు, వాసు, బి.శ్రీను, వి.రాజేష్, ఎ.తౌడు, వేమల గురుమూర్తి, పి.గోపి, రఘు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



శివాజీని సన్మానిస్తున్న సాహితీవేత్తలు, థియేటర్ యాజమాన్య సిబ్బంది



తుపాను గాలులకు నేలకొరిగిన వరిపంట

వెన్ను వదిలింది... నేలకొరిగింది

ఆందోళనలో వరి రైతులు

ప్రజాశక్తి - మక్కువ

ఇప్పుడిప్పుడే వరి చేను గింజ కట్టి వెన్నువదులుతున్న సమయంలో ఇటీవల వీచిన తుపాను గాలులకు వరిపైరు నేలగొరడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ఇటీవల తుపాను హెచ్చరికలు రావడంతో మరింత కలవరం చెందారు మండలంలో చాలాచోట్ల వరి చేలు దుస్థితి ఇదే రకంగా ఉంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో మండలంలో వెంగళరాయసాగర్ ప్రాజెక్టు పరిధిలోనూ, అలాగే వర్షాధార చెరువుల దిగువను సుమారు 11,500 ఎకరాల్లో వరి సాగవుతుంది. ప్రస్తుతం వరి పైరు పరిస్థితిని పరిశీలిస్తే తక్కువ కాలంలో కోతకు వచ్చే వరి వంగడాలు ఇప్పటికే పూర్తిస్థాయిలో వెన్ను వదిలి కోత దశకు చేరుకోగా, మరికొంత ప్రాంతంలో వరి చేను వెన్ను వదులుతూ గింజకట్టే దశకు చేరుకుంది. అయితే చాలా వరకు చేలు ఏపుగా పెరగడంతో తేలిక పాటుగా పూర్తిస్థాయిలో నేలమట్టమయ్యాయి. గింజ కట్టే స్థితిలో చేలు పడిపోవడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎంతో శ్రమించి చేతికి వచ్చే సమయంలో పంట పొలాల్లో చేలు ఈ రకంగా దర్శనం ఇవ్వడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ స్థితిలో చేను పడిపోతే గింజలు కవ్వగా మారే ఆస్కారం ఉందని రైతులు విలపిస్తున్నారు. మరోవైపు చేతికి అందిన పంటను కోసుకోలేక దిగులు చెందుతున్నారు. మరోవైపు తుపాను గండం పొంచి ఉండడం కూడా రైతుకు కంటి మీద కొనుకు లేకుండా చేస్తుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

దళితులపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి

- పెత్తందార్లు పెట్టిన తప్పుడు కేసును రద్దు చేయాలి
- కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పాలకొండ

దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, దళితులపై పెట్టిన తప్పుడు కేసులను వెనక్కి తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ ఈనెల 22న జియ్యమ్మవలసలో గడిసింగిపురం గ్రామానికి చెందిన గరుగుబిల్లి ఏలేసు, చింతాడ మధు, నాగళ్ల బుజ్జి మార్కెట్‌కు రాగా, అదే సమయంలో జియ్యమ్మవలసకు చెందిన బొంగు మణిభూషణరావు, దత్తి సతీష్ కులం పేరుతో దూషించి కొట్టారన్నారు. అనంతరం జియ్యమ్మవలస పోలీసులు ఏలేసును పార్వతీపురం హాస్పటల్‌కు చికిత్స నిమిత్తం పంపించి ఎఫ్ఐఆర్ వేశారు. మణిభూషణరావు, దత్తి మౌళి, దత్తి సతీష్ దళిత యువకులపై తప్పుడు కేసు పెట్టారని, ఆ కేసుతో ముడిపెట్టి దళితులు పెట్టిన కేసును నిర్వీర్యం చేయడానికి పెత్తందారులు ప్రయత్నిస్తున్నారని, దీనిపై అధికారులు సమగ్ర విచారణ జరిపించి దళిత యువకులపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన వారిని అరెస్ట్ చేయాలని, దళితులపై పెట్టిన తప్పుడు కేసును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎఒకు వినతిని సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ధావాల రమణారావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు కోరంగి సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెలగాడ దుర్గారావు, భూతాల మోహనరావు, దళితులు పాల్గొన్నారు

బాధితులను కెవిపిఎస్ పరామర్శ


పార్వతీపురంరూరల్ : జియ్యమ్మవలసలో ఈనెల 22న దళిత యువకులు గరుగుబిల్లి ఏలేసు, చింతాడ మధు, నాగళ్ల బుజ్జిపై దాడి చేసి తిట్టి, కొట్టిన వారిపై కేసులు పెట్టి, రిమాండ్‌కు పంపించాలని, దళితులపై పెట్టిన తప్పుడు కేసును రద్దు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యమ్మల మన్మధరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జిల్లా హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న గరుగుబిల్లి ఏలేసును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులపై దాడి చేసిన ముగ్గుర్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించాలని, దళిత యువకులపై పెత్తందార్లు పెట్టిన తప్పుడు కేసులు రద్దు చేయాలని, హాస్పటల్‌లో ఉన్న గరుగుబిల్లి ఏలేసుకు పూర్తి స్థాయిలో వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేశారు. లేక పోతే దళిత, గిరిజన సంఘాలను కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈ బలరాం పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కెవిపిఎస్, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

గిరిశిఖర గ్రామాల్లో ఏనుగుల హల్‌చల్

ప్రజాశక్తి - కురుపాం



తిత్తిరిలో సంచరిస్తున్న ఏనుగులు

మండలంలోని తిత్తిరి పంచాయతీలో సీడిగూడ, పులిపుట్టి, తిత్తిరి తదితర గిరిశిఖర గ్రామాల్లో శుక్రవారం నాలుగు ఏనుగుల గుంపు సంచరించింది. పంటలను నాశనం చేస్తూ గ్రామ పరిసరాల్లో తిరుగుతుండడంతో గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై పలితే జనావాసాల్లోకి, పంట పొలాల్లోకి ఏనుగులు రావడంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని గిరిజనులు వాపోతున్నారు. జీడి, అరటి, పసుపు తదితర అటవీ ఫలసాయాలను నాశనం చేస్తున్నాయని, గ్రామాలపై పడి ఎప్పుడు ఏం చేస్తాయోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి తక్షణమే ఏనుగుల గుంపును జనావాసాల నుంచి దూరంగా తరలించాలని కోరారు.

పార్కింగ్ సమయంలో జాగ్రత్తలు పాటించాలి : సిఐ

ప్రజాశక్తి - సాలూరురూరల్

పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న లారీ యూనియన్ సభ్యులకు, డ్రైవర్లు, క్లీనర్లకు డ్రైవింగ్, పార్కింగ్ సమయంలో జాగ్రత్తలు పాటించాలని పట్టణ సిఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు, నియమాలను పాటించాలని లారీ, ఇతర వాహన డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో మత్తు పదార్థాలు రవాణా చేయడం గానీ, వాటిని సేకరించడం తీవ్రమైన నేరమని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సాలూరు మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ జెవివిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ డ్రైవర్లు, క్లీనర్లకు తప్పనిసరిగా ప్రభుత్వ నియమాలు ప్రకారం నడుచుకోవాలని తెలిపారు. అత్యవసర సమయంలో ప్రమాదం గురైతే చేయాల్సిన ప్రథమ చికిత్స గురించి గుండె జబ్బులు సంబంధించి, పాముకాటు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ నారాయణరావు వివరించారు. కార్యక్రమంలో పోలీస్, మోటర్ వెహికల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద పోలీసుల మాక్ డ్రిల్

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పి.కోనవలస చెక్పోస్ట్ వద్ద నిఘా వ్యవస్థ పటిష్టం చేసే ఉద్దేశంతో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. దీనిలో భాగంగా మాదక ద్రవ్యాలైన గంజాయి, నాటు సారా అక్రమంగా రవాణా చేస్తున్న సందర్భంలో గుర్తించడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన డాగ్స్‌ను, అదేవిధంగా డ్రోన్ కెమెరాలను ఉపయోగించి మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో సాలూరు రూరల్ సిఐ పి.రామకృష్ణ, పాచిపెంట ఎస్ఐ కెవి సురేష్, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు. రూరల్ సిఐ చెక్ పోస్ట్ సిబ్బందికి వాహనాల తనిఖీ విషయంలో సూచనలు చేశారు.



తాళాలు తీయని నందివాడ సచివాలయం

సమయం దాటినా తెరుచుకోని సచివాలయం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం లోని పనస నందివాడ సచివాలయం తలుపులు శుక్రవారం ఉదయం 10. 44 నిమిషాలు అయినా తెరుచుకోలేదు. దీంతో ఇక్కడి ఉద్యోగులు ఎంత సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారో ఇందుకు నిదర్శనం. 10:44 నిమిషాలకు విఎఎ వచ్చి 10:45 నిమిషాలకు సచివాలయం, రైతు సేవా కేంద్రం తలుపులు తెరిచారు. నిబద్ధత కలిగి ప్రజలకు సేవలు అందించాల్సిన ఉద్యోగులు సమయానికి విధులకు హాజరు కాకపోవడంతో సచివాలయానికి వచ్చే అర్జీదారులంతా వెనుతిరుగుతున్నారు. సమయపాలన పాటించి సకాలంలో ఉద్యోగులు హాజరు కావాలంటే పూర్తిస్థాయిలో ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ ఉంటే గాని వీరిలో మార్పు రాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని రెవెన్యూ పరిధిలో అనేక భూ సమస్యలు ఉన్నాయని, దీనికి గత ప్రభుత్వంలో జరిపిన రీ సర్వేను కొనసాగిస్తూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకే ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు. శుక్రవారం తాళ్లడుమ్మ పంచాయతీలో రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు దరఖాస్తులను స్వీకరించారు. గత రీసర్వేలో అనేక తప్పులు దొర్లాయని వాటిని సవరించి తిరిగి రైతుకు వారి భూమిని ఈ సర్వే ద్వారా అప్పచెప్పేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని పార్వతీపురం ఆర్టీసీ డిఎం కనకదుర్గ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలను, సౌకర్యాలను పరిశీలించారు. ఆర్టిసి బస్సులో ప్రయాణం సురక్షితంగా ఉంటుందన్నారు. కాంప్లెక్స్ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటుతో ప్రయాణికులు ఎటువంటి ఇబ్బంది పడకుండా మద్యం షాపు చుట్టూ కంచె ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, ఉప సర్పంచ్ కిషోర్ ఉన్నారు.

నేత్ర శస్త్ర చికిత్సలకు తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గంలో ఇటీవల జరిగిన నేత్ర వైద్య శిబిరాల్లో గుర్తించిన నేత్ర చికిత్స అవసరమైన 28 మందికి పుష్పగిరి కంటి ఆసుపత్రికి శుక్రవారం తరలించినట్లు జిల్లా కంటి వెలుగు సెల్ అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. ఇటీవల సచివాలయ పరిధిలోని గ్రామాల్లో నిర్వహించిన కంటి వైద్య శిబిరాల్లోనూ, సిఎం నేత్ర కేంద్రాల్లో నిర్వహిస్తున్న నేత్ర పరీక్షల్లో కేటరాక్ట్, టెరిజియం లోపం ఉన్న వారిని గుర్తించి ఉచితంగా శస్త్ర చికిత్సల కోసం తరలిం చామని తెలిపారు. శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారిని ఫాలో అప్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర రజని, సురేష్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కకు వింత జంతువు జననం

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని డికె పట్నంలో శుక్రవారం కుక్క కడుపులో వింత జంతువు జన్మించడం ఆసక్తి రేపుతోంది. పులి పిల్లని పోలిన జంతువు కుక్కకు పుట్టడంతో ప్రజలు ఆసక్తితో చూడ్డానికి ఎగబడుతున్నారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి వింత జంతువును చూడ్డానికి వస్తున్నారు.



కుక్క కడుపుతో పుట్టిన పిల్లిని పోలిన వింత జంతువు

ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

: మండలంలోని గొట్టుపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డిఇఒ పాలక నారాయడు శుక్రవారం సందర్శించారు . విద్యార్థుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ పరిశీలించారు. మరుగుదొడ్లు, తాగునీరు క్షుణంగా పరిశీలించారు. విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ఫోకస్ పెట్టి ముందుకు తీసుకురావాలని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచారన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ కోటిబాబు ఉన్నారు.



సిపిఎం జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

గిరిజన హక్కులపై బిజెపి దాడి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

బిజెపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చి ప్రజలు, గిరిజనుల హక్కులపై దాడులు చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. మండలంలోని మూలజమ్ములో శాఖ మహాసభ సందర్భంగా జెండా ఆవిష్కరణ జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసేలా బిజెపి పరిపాలన ఉందని, ప్రజలపై భారాలు వేసి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే చర్యలను ప్రోత్సహిస్తుందని అన్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్రంలో కూటమి ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలం చెందుతుందని ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజలంతా పోరాడాలని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి అవినాష్ మాట్లాడుతూ అధిక ధరలు, ప్రజా సమస్యలు పరిష్కారానికి నవంబర్ 8 నుంచి 15 వరకు ఇంటింటి ప్రచారం. ప్రజాహోరు యాత్రలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. నవంబర్ 15న మండల కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేస్తామన్నారు. గ్రామాల్లో స్థానికంగా మంచినీరు, పారిశుధ్యం, భూ సమస్యలు, పోడు పట్టాలు విద్యుత్ స్తంభాల మార్పులు, సాగునీరు, చెక్ డాములు వంటి సమస్యలు పరిష్కరించాలని, లుంబేసు, తాడికొండ పంచాయతీలో స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకుంటే పోరాటం చేపడతామన్నారు. అనంతరం మహాసభలో పంచాయతీ పరిధిలో సిపిఎం చేపట్టే పోరాటాలు కార్యక్రమాలను సమీక్షించి భవిష్యత్తులో స్థానిక సమస్యలపై తీర్మానాలను చేశారు. అలాగే డిసెంబర్ 10,11 తేదీల్లో కురుపాంలో జరగనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో సన్యాసిరావు, రమేషు, గంగాధర, మోహన్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి -పాచిపెంట

స్థానిక పౌర సరఫరాల మండల స్థాయి స్టాక్ పాయింట్ (ఎంఎల్ఎస్)ను ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిస్టర్లలో నమోదైన మేరకు స్టాక్ పాయింట్‌లోని సరుకులను ఉన్నది, లేనిది పరిశీలించారు. సకాలంలో రేషన్ సరుకులు ప్రజలకు చేరాలని, అందుకు సంబంధించిన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను పిఒ ఆదేశించారు. గోడౌన్ సరుకు నిల్వలను లెక్కించి దస్త్రాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఈనెలలో లబ్దిదారులకు కందిపప్పు పంపిణీ చేయలేదని విలేకరులు ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో పంపిణీ కాకపోవడం పట్ల సిఎస్‌డిటి రంగారావును ప్రశ్నించారు. ఈనెల 15 ,16 తేదీల్లో సరుకు వచ్చిందని, అది కూడా 60 శాతం కందిపప్పు రావడంతో పంపిణీ చేయలేకపోయామని సిఎస్‌డిటి నివేదించారు. అలాగే పద్మాపురం జిసిసి డిపో ద్వారా కొద్ది నెలలుగా 14 కిలోలు బియ్యం తక్కువ రావడంతో లబ్దిదారులకు పూర్తిస్థాయిలో బియ్యం పంపిణీ జరగడంలేదని కొంతమంది లబ్దిదారులు పిఒ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన పిఒ జిసిసి అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను పిఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పరిసరాలను, తరగతి గదులను, వంటగదిని పరిశీలించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. పారిశుద్ధ్యం లోపం లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో తమ ప్రతిభను కనబరిచేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. ఇందుకు విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ పాత్రో, గోడౌన్ సూపరింటెండెంట్ పైడిరాజు, వార్డెన్ స్వర్ణలత ఉన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని పెదఖర్జ పంచాయితీ సప్పగూడ జిపి పాఠశాలను ఇండి ఎంపిటిసి కద్రక మల్లేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా చదువులో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కొంతసేపు పాఠ్యాంశాల బోధన చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పాలకులు ఎందరు మారినా మున్సిపల్ కార్మికుల జీవితాలు మారలేదని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ అన్నారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల స్థానిక సమస్యల పరిష్కారానికై శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం మస్తరు పాయింట్ వద్ద వెంకటరమణ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని స్థానిక సమస్యలు అనేకం ఉన్నాయన్నారు. కార్మికులపై రోజురోజుకు పనిభారం పెరుగుతుందని దొడ్డిదారిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఇళ్లల్లో పని చేయించుకుంటున్నారని అన్నారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల నుంచి సంతకాలు సేకరణ, 25, 26న మస్తర్ పాయింట్ల వద్ద ధర్నాలు, 27న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్పర్సన్‌తో సామాజిక రాయబారాలు, 28న మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సాలూరు: మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వివిధ దశల్లో చేపట్టనున్న పోరాటానికి సంబంధించిన పోస్టర్‌ను యూనియన్ నాయకులు విడుదల చేశారు. పార్వతీపురం, సాలూరు పట్టణాల్లో మృతి చెందిన ఔట్సోర్సింగ్ కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు, నష్టపరిహారం నేటికీ పూర్తి చేయలేదని, జీవో 36 ప్రకారం డ్రైవర్లకు వేతనాలు చెల్లించాల్సి ఉన్నా ఇవ్వడంలేదని, పార్వతీపురంలో అక్రమంగా తొలగించిన క్లాప్ ఆటో డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని, పాలకొండ పట్టణంలో కరోనా సమయంలో పనిచేసిన కార్మికులను విధుల్లోకి తీసుకుని, ఉన్న కార్మికులపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి టి.శంకర్రావు, కమిటీ సభ్యులు శ్రీను, పోలరాజు, రవి, లక్ష్మి, తౌడమ్మ పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కోశాధికారి వెంకటరమణ

పశుగణ సర్వేకు పాడి రైతులు సహకరించాలి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలో ఈనెల 25 నుండి 28 వరకు పశుగణన చేపడుతున్నట్లు మండల పశు వైద్యాధికారి ఎన్.మునికుమార్ తెలిపారు. శుక్రవారం గవరంపేట పంచాయతీ వెంకట్రాజపురంలో టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు చేతుల మీదుగా పోస్టర్ను విడుదల చేశారు. మండలంలోని 13,189 పాడి రైతు కుటుంబాలకు సంబంధించి పశుగణన నిర్వహిస్తున్నట్లు ఇందుకోసం ప్రతి రైతు తమ సిబ్బందికి సహకరించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పాలకొండ: మండలంలో శుక్రవారం నుంచి పశుగణన కార్యక్రమం చేపట్టారు. రెవెన్యూ కార్యాలయంలో పోస్టర్లను తహశీల్దారు మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాల సహాయ సంచాలకులు పి.మాణిక్యరావు మాట్లాడుతూ పాలకొండ రూరల్, అర్బన్ కలిపి 18500 ఇళ్ల నుండి 22 మంది ఎన్యుమెరేటర్స్ వివరాలు సేకరిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ రంగారావు, మండల పశు వైద్య అధికారి సిద్దార్థ, ఎఎస్ఒ చిన్నారావు, తదితరులు ఉన్నారు.

నర్సరీ పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మిలో ఉపాధి హామీ చట్టం ద్వారా చేపడుతున్న మునగ నర్సరీని శుక్రవారం ఎపిఒ జి.సత్యంనాయుడు పరిశీలించారు. వీటిపై ప్రత్యేక బాధ్యతలు తీసుకోవాలని టెక్నికల్ సహాయకులను ఆదేశించారు. ఆయనతో పాటు సర్పంచ్ జి.రామ్మోహన్‌రావు, సచివాలయ కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పోలీస్ అమరుల సంస్మరణ వారోత్సవాలు -2024 భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పోలీస్ సిబ్బంది ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ సిబ్బందికి ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళు అన్న అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మంచి ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయనున్నారు. ఎఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్ ఆధ్వర్యంలో పోటీలను ఎస్ఐలు ఫక్రుద్దీన్, దినకర్, డిసిఆర్‌బి సిబ్బంది పర్యవేక్షించారు.

జియ్యమ్మవలస : ఈనెల 21న జరిగిన పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శుక్రవారం చినమేరంగి ఎస్సై పి.అనేష్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థి దశ నుండే క్రమశిక్షణకు అలవాటు పడేలా యువత సైబర్ నేరాలను ఎలా నిరోధించాలో అన్న అంశాలపై వ్యాసరచన పోటీ ఉంటుందని తెలిపారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో గెలుపొందిన వారికి త్వరలోనే సబ్ డివిజనల్ స్థాయి వ్యాసరచన పోటీలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు.

సీతానగరం: ఓపెన్ హౌస్ విధానంపై విద్యార్థులకు ఎస్సై ఎం.రాజేష్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. స్థానిక పోలీసుస్టేషన్లో పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం భాగంలో స్థానిక ఉన్నతపాఠశాల విద్యార్థులకు పోలీసింగు విధానాన్ని, స్టేషన్లో సిబ్బంది గూర్చి, పలు చట్టాల గురించి ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు వివరించారు. విద్యార్థుల లక్ష్యాన్ని అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్లో ఫిర్యాదులిచ్చే విధానం, వాటిపై కేసులు నమోదు గూర్చి వివరించారు. వారం రోజుల పాటు అమరుల వారోత్సవాలు జరుగుతాయని ఆయన చెప్పారు. ఈసమావేశంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

విద్యార్థుల మాక్ పార్లమెంట్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులతో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. కళాశాల ఆర్ట్స్ డిపార్ట్మెంట్ స్వరూప, సింహాచలం, చరిత్ర అధ్యాపకులు శ్రీవాణి, ఇంగ్లీష్ అధ్యాపకులు కృష్ణ ఆధ్వర్యంలో మాక్ పార్లమెంట్ విద్యార్థులతో నిర్వహించారు. అన్ని గ్రూపులకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. స్పీకర్‌గా శివానంద్ వ్యవహరించారు. ప్రధానమంత్రి పాత్రధారి పద్మిని ఉపన్యాసంతో ప్రారంభించి పార్లమెంటుకు కావాల్సిన అధికార యంత్రాంగం ఆయా విద్యార్థులు నిర్వహించారు. ప్రతిపక్ష హోదాలో తరుణ్ సమర్థవంతంగా అధికారపక్షానికి ఊపిరి సలుపుకోకుండా ప్రశ్నలు సంధించారు. అదే తరుణ్ అధికారపక్ష మంత్రులు సమాధానాలు ఇచ్చి ప్రతిపక్షం నోళ్లు మూయించారు. చివరిగా అధికారపక్షం వారి సమాధానానికి సంతృప్తి చెందని ప్రతిపక్షం వాకౌట్ చేసి సభ నుంచి బయటకు రావడంతో సభాపతి శివానంద్ కొంచెం సేపు అధికారపక్షంతో సమావేశాన్ని కొనసాగించి సమాప్తం చేశారు. ఈ కార్యక్రమం అచ్చం పార్లమెంటు సమావేశాలను తలపించేలా కనిపించింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవరం, వైస్ ప్రిన్సిపాల్ రామయ్య, ఐ క్యు ఎ సి కల్పన పాల్గొన్నారు.

28కి ధర్నా వాయిదా

ప్రజాశక్తి -కొమరాడ

మండలంలోని కూనేరు వద్ద శనివారం జరగనున్న ధర్నాను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు సిపిఎం జిల్లా కమిటీ కొల్లి సాంబమూర్తి తెలిపారు. పార్వతీపురం నుండి కునేరు మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే రహదారి మార్గంలో పెద్దపెద్ద గోతులను కప్పి అటు వాహనదారులు ఇటు ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని కోరుతూ ఈనెల 26న కూనేరు వద్ద రాయగడ లారీ అసోసియేషన్, వివిధ పార్టీలు, వాహనదారుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టేందుకు నిర్ణయించామన్నారు. అయితే శనివారం కూనేరు సంత జరుగుతున్న సందర్భంగా గిరిజనులను ఇబ్బంది పెట్టకూడదన్న ఉద్దేశంతో ఈ ధర్నాను ఈనెల 28కి వాయిదా వేస్తున్నామని అన్నారు.

ప్రభుత్వాసుపత్రిలోకి పాము

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రంలోకి శుక్రవారం ఓ పాము చొరబడే ప్రయత్నం చేసింది. దీన్ని పసిగట్టిన ఉద్యోగులు వెంటనే చావగొట్టి బయటకు విసిరేశారు. గమనించకపోతే ఎవరో ఒకరు పాముకాటుకు గురయ్యే అవకాశం వుండేదని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు.

పెన్షన్లు సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ నవంబర్ 1న సక్రమంగా చేయాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ విద్యా, సంక్షేమ సహాయకులకు ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్యా, సంక్షేమ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పింఛనుదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా గ్రామస్థాయిలో పింఛన్లు సక్రంగా పంపిణీ చేసి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ దూబ వెంకటరమణ, విద్యా, సంక్షేమ సహాయకులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల పట్ల నిర్లక్ష్యమెందుకు?

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ఎందుకింత నిర్లక్ష్యమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఎగువదార బంధం, దిగువ ద్వార బంధం, నడిమి ద్వారబంధం గ్రామాల్లో గిరిజన విద్యార్థులు చదువుకోసం అనేక అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. 3 విడతలు నాడు నేడు కార్యక్రమాలు జరిగినా విద్య శాఖ అధికారులకు ఈ పాఠశాలలు ఎందుకు కనిపించలేదానని ప్రశ్నించారు. మండలంలో ఇలాంటి పాఠశాలలు 23 ఉన్నాయన్నారు. రామానగరం పాఠశాల సమస్య గురించి డిఇఒకు వినతిని ఇచ్చి నెల రోజులు కావస్తున్నా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు లేవని చెప్పారు. అధికారులు స్పందించి గ్రామాలు సందర్శించి పాఠశాలకు మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు.

ఎస్‌జిఎఫ్ రాష్ట్ర పోటీలకు బాలికలు

సీతంపేట : ఈనెల 26 నుంచి జరగబోయే ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనడానికి స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు సిద్ధమవుతున్నారని ప్రధానోపాధ్యాయులు పి.పద్మశ్రీ తెలిపారు. విద్యార్థినులకు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నతపాఠశాల సీతంపేట నుంచి బాల్ బ్యాడ్మింటన్ అండర్-17కు ఏడుగురు, అండర్-14 అథ్లెటిక్స్, అండర్-17 ఇద్దరు, హాకీ అండర్ 17 నలుగురు, ఖోఖో అండర్ -17 ఒకరు, అండర్ 14 ఇద్దరు, బ్యాడ్మింటన్ అండర్ 17 ఒకరు, అండర్ 14 ఒకరు, ఆర్చరీ అండర్ 17 ఇద్దరు, అండర్ 14 ఇద్దరు విద్యార్థులు హాజరవుతారన్నారు. ఈ పోటీలు అక్టోబర్ 26 నుంచి నవంబర్ 8 వరకు ఒక్కొక్క ఈవెంటు ఒక్కొక్క జిల్లాలో జరుగుతాయన్నారు.

భూరీసర్వేలో వారసులను గుర్తించాలి

ప్రజాశకి - వీరఘట్టం

భూ రీసర్వేలో అసలైన వారసులను గుర్తించి వారికి పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎన్.సింహాచలం డిమాండ్ చేశారు. గ్రామాల్లో బంజరు, పోరంబోకు, గెడ్డపోరంబోకు, సీలింగు భూములు మొదలైన వివిధ రకాల భూములను ప్రభుత్వం పేదలకు అసైన్మెంట్ చేసి సాగుకు ఇచ్చిందన్నారు. ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా 1977లో పిఒటి చట్టం అసైన్డ్ ల్యాండ్ బదలింపు చట్టం వచ్చిందన్నారు. ఈ చట్టం ప్రకారం అమ్మడం, కొనడం నిషేధమన్నారు. ఇప్పుడు ఆ భూములు అత్యధికంగా అన్యాక్రాంతమై పేదవారి నుంచి పెద్దవారి స్వాధీనంలో ఉన్నాయని అన్నారు. పిఒటి చట్టాన్ని సవరించి 2023లో జిఒ 596 తీసుకొచ్చిన భూములను రీసర్వే నిర్వహించిందన్నారు. అప్పటి ప్రభుత్వం వీరఘట్టం మండలంలోనే 11 పంచాయితీల్లో రీ సర్వేలో 58 ఎకరాలు 85 సెంట్లు 119 మందికి ఫ్రీ హెూల్డ్ చేసి పాస్ పుస్తకాలు మంజూరు చేశారన్నారు. ఇది చట్ట వ్యతిరేకమని , చట్టాలను ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాని పక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

గుమ్మలక్ష్మీపురం మండలం బయ్యాడలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామస్తులు శుక్రవారం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ ఆధ్వర్యాన వారు పిఒను కలిసి సమస్యల్ని వివరించారు. రేగిడి నుంచి బయ్యాడకు పక్కా రహదారి నిర్మించాలని కోరారు. రహదారి లేక అనారోగ్యానికి గురైనప్పుడు, అత్యవసర పరిస్థితుల్లో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారని చెప్పారు. గ్రామంలో అంగన్వాడీ, పాఠశాల భవనాలు లేక పురిపాకల్లో నిర్వహిస్తున్నారని చెప్పారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. పిఒను కలిసిన వారిలో వార్డు సభ్యులు నిమ్మక రంగారావు, పెద్దలు జీలకర్ర సోమాలు,నిమ్మక ప్రకాష్, కామేష్ వున్నారు.

12వ వేతన కమిషన్‌ను నియమించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన సవరణకు సంబంధించిన 12వ పిఆర్‌సి కమిషన్‌ను తక్షణమే నియమించాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో శుక్రవారం పర్యటించి పలు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్‌ను నియమించడంతో పాటు ఐఆర్ ప్రకటించాలన్నారు. గతేడాది జూలై 1 నుంచి నూతన వేతన సవరణను అమల్లోకి తేవాల్సి ఉండగా, ఇప్పటి వరకు కమిషన్ చైర్మన్‌ను నియమించకపోవడం దారుణమన్నారు. 90 నెలలకు సంబంధించిన డిఎ బకాయిలు చెల్లించాల్సి ఉండగా, ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో ఏడు నెలల నుంచి రూ.100 కోట్ల పిఎఫ్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఎపిజిఎస్ఐ, సరెండర్ లీవ్ నగదు, ఉద్యోగ విరమణ అనంతర ప్రయోజనాలు, సీపీ ఎస్ మార్జిన్ గ్రాంటు తదితర బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ మంత్రి సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ పర్యటనలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బెహరా సంతోష్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుమల, రమేష్, నాయకులు బీవీఆర్కే నాయుడు, కాశి, చుక్క రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని కాశీపేట, సూరంపేట సచివాలయాలను శుక్రవారం ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాలను మధ్యాహ్న భోజన పథకాలను, స్కూళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఆయన అన్నారు. సచివాలయ సిబ్బంది సకాలంలో సచివాలయం ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పి.మురళీకృష్ణ, ఎస్.సంతోష్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.